క్లుప్తంగా

అన్నసమారాధన

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని సంతోషి మాత ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. దసరా నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని బిక్కవోలు రోడ్డులో గల మణికంఠ స్వామి దేవస్థానంలో వారాహి అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను గురువారం ఉదయం 9.41 గంటలకు వైభవంగా నిర్వహించారు. వేద పండితులతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. యజ్ఞ కర్తలుగా సత్తి సుబ్బారెడ్డి దంపతులు, ఎన్వీవీ రామారెడ్డి దంపతులు కూర్చున్నారు. వారి చేతుల మీదుగా వారాహి అమ్మవారికి హోమం జరిపారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తగ సూర్యకుమారి, కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మణికంఠ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సత్తి భగవాన్ రెడ్డి, కార్యదర్శి మండ రాజారెడ్డి, ప్రతినిధులు డీఆర్కే రెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, కొండారెడ్డి వెంకట కృష్ణారెడ్డి, సతీష్ రెడ్డి, మున్నా, మండ మణికుమార్ శర్మ భవాని, వారాహి అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు పాల్గొన్నారు.

అనపర్తి ఏరియా ఆస్పత్రి తనిఖీ


ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పద్మ

అనపర్తి: అనపర్తి ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా ఆసుపత్రి వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ ఎం.పద్మ అన్నారు. ఆమె శుక్రవారం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రక్త పరీక్షల విభాగం, ఫార్మసీ, స్టోర్స్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, సీఎంఎస్ఓ డాక్టర్ పద్మశ్రీ, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఐదుగురి ఎంపిక



పందలపాకలో క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అండర్ - 19 బాల్ బ్యాడ్మింటన్‌కు పైన గీత రమ్యశ్రీ, హ్యాండ్ బాల్ పోటీలకు రాయి రూప, గొలుగూరి శ్రావ్యరెడ్డి, కోకో విభాగంలో వైరాల సుస్మిత, గొల్లవిల్లి కాంత్రి ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు యువరాజారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రంగంపేట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రంగంపేట టౌన్ ఫీడర్, కార్గిల్ ఫీడర్, రంగంపేట ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని వినియోగదారులకు శనివారం విద్యుత్ సరఫరా ఉండదని రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ అన్నారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్చడం, లైన్లు వేయడం జరుగుతోంది. దీంతో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.
రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఆ సంస్థ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేబీబీ నటరాజన్ తెలిపారు. ఆ సమయంలో రాజానగరం, సూర్యారావుపేట, ఇండస్ట్రీ ఫీడర్, జీజీయూ, నన్నయ, రాజమహేంద్రవరం పేపరు మిల్లు, బ్రిడ్జి కౌంటీ, తూర్పుగానుగూడెం, పల్లకడియం, రామస్వామిపేట, ఐశ్వర్య రైస్ మిల్లు, లెనోరా డెంటల్ కాలేజీ, క్వారీ, సాక్షి పేపర్ యూనిట్, ఐఎస్‌టీఎస్ మహిళ ఇంజినీరింగ్ కళాశాలలకు విద్యుత్ ఉండదన్నారు.

విభజన వద్దు.. కలిసే ఉందాం..

- రాజానగరం పంచాయతీని ముక్కలు చేయవద్దు
- గ్రామసభలో స్పష్టం చేసిన ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు


రాజానగరం పంచాయతీ విభజన వద్దంటూ గ్రామసభలో వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


గంద్రేడు పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్ మాధవీలత, ఆమె భర్త శ్రీను

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం పంచాయతీని రెండుగా విభజించవద్దంటూ మెజారిటీ ప్రజలు స్పష్టం చేశారు. రాజానగరంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. దీంతో రెండు రాజకీయ వర్గాల మధ్య నెలకొన్న వివాదంతో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా ముగిసింది. గ్రామ సర్పంచ్ కుందేటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మొదట గ్రామాభివృద్ధి, సమస్యలపై చర్చించారు. అనంతరం పంచాయతీ విభజన ప్రస్తావన చిచ్చు రేపింది. ప్రస్తుతం శివారు గ్రామంగా ఉన్న సూర్యారావుపేటను ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని ఆ గ్రామానికి చెందిన పి.సురేష్, ప్రసాద్ నాలుగు రోజుల క్రితం అధికారులకు అందజేసిన వినతిపత్రం గురించి ప్రస్తావిస్తూ ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు కేకలు వేసుకున్నారు. అయితే తాము విభజనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదంటూ గ్రామ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ప్రగడ చక్రి, మట్టా దుర్గారావు, అంకం సాయి, యక్కల నాగేశ్వరరావు, రాపాక తులసీ, ఎంపీటీసీ సభ్యులు, మద్దతుదారుల సంతకాలతో కూడిన మరో వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. అయితే విభజన కోరుతూ తాము సంతకాలు చేయలేదని, శ్మశాన వాటిక కోసం అంటే చేశామని ఆ వినతి పత్రంపై సంతకాలు చేసిన వారిలో కొంత మంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విభజన అంశంతో గ్రామసభ రసాభాసగా ముగిసింది. స్థానిక నాయకులు దూలం పెద్ద, ముప్పిడి శ్రీను, మాజీ ఉపసర్పంచ్ కామిశెట్టి విష్ణు, జక్కంపూడి సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్. ప్రసాద్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంద్రేడు గ్రామ సభ బహిష్కరణ

పెదపూడి: గంద్రేడు గ్రామాభివృద్ధికి ఆ గ్రామ సచివాలయం కార్యదర్శి సహకరించడం లేదంటూ సర్పంచ్ కుడిపూడి మాధవీలత అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభను సర్పంచ్ మాధవీలత, ఉప సర్పంచ్ కర్రి శ్రీను, ఇతర సభ్యులు బహిష్కరించారు. కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవీలత, ఆమె భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీను మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సంబంధించి నాలుగు నెలలుగా తీర్మానాలు అడుగుతుంటే ఇవ్వడం లేదన్నారు. గ్రామ శివారు లంకలో డ్రైనేజీ నిర్మాణం చేయాలని చేబితే అనేక రూల్స్ చెబుతున్నారన్నారు. గ్రామంలో మరో చోట అభివృద్ధి పని చేసి, దానికి సంబంధించి సంతకాలు చేయాలని చెబుతున్నారంటూ ఆరోపించారు. అలాగే నాన్ లేఅవుట్‌కు సంబంధించి బెటర్‌మెంట్ చార్జీలు చెల్లిస్తామని ప్రజలు వస్తే కట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బాధితుడికి న్యాయం చేయాలి

పెదపూడి: చింతపల్లి లాకు వద్ద ఇటీవల ఒక దళితుడి షెడ్డును కూల్చి వేసిన ఘటనలో గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఆ బాధితుడికి షెడ్డు నిర్మించాలని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు అన్నారు. ఆయన గురువారం చింతపల్లి లాక్ వద్ద విలేకరులతో మాట్లాడారు. వేంద్ర గ్రామానికి చెందిన జి.ఏడుకొండలు షెడ్డు వేసుకుని బైక్ రిపేరు పనులు చేసుకుంటున్నాడన్నారు. ఆ షెడ్డును గ్రామానికి చెందిన కొందరు కూల్చివేశారు. అయితే దాన్ని నిర్మించి ఇస్తామని గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారని, కానీ నిర్మాణం విషయంలో జాప్యం చేస్తున్నారన్నారు. దీనిపై బాధితుడికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు, ఐఎఫ్‌టీయూ నాయకుడు రాగుల రఘువులు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై చర్యలు


అనపర్తిలో ఆటో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీను నాయక్

అనపర్తి: దీపావళిని పురస్కరించుకుని అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్. శ్రీను నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆటో ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎవరైనా లైసెన్స్ లేకుండా దీపావళి మందులు తయారు చేస్తే అనపర్తి పోలీసుల 94407 96590 నంబర్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్లు 112, 100కు సమాచారం అందించాలన్నారు.

రాంబాబు యువసేన సేవలు స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- రక్తదాన శిబిరం ప్రారంభం


రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాంబాబు యువసేన సమాజానికి చేస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పార్టీ అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాంబాబు యువసేన ఆధ్వర్యంలో 15వ రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాంబాబు యువసేన వ్యవస్థాపకుడు సత్తి రామకృష్ణారెడ్డి సామాజిక సేవలో భాగంగా 15 ఏళ్లుగా నిరాటంకంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అనపర్తి బ్లడ్ డోనర్స్ యాప్ రూపకల్పన చేసి, దీని ద్వారా నిరంతరం రక్తదానం చేయించడం ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. శిబిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ సంస్థ ద్వారా దాతల నుంచి దాదాపు మూడు వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. అనపర్తి బ్లడ్ డోనర్స్ యాప్ ద్వారా రెండు వేల మంది దాతలు నిరంతరం రక్తదానం చేయడానికి సహకరిస్తున్నారన్నారు. శుక్రవారం నిర్వహించిన శిబిరంలో 62 మంది రక్తదానం చేయగా, రాజమహేంద్రవరానికి చెందిన సంజీవని వలంటరీ బ్లడ్ బ్యాంక్ బృందం రక్త సేకరణ చేసిందన్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి (నేషనల్), అనపర్తి పట్టణ పార్టీ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రి ధర్మారెడ్డి (దొరబాబు), వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, వాణిజ్యవేత్త కర్రి సత్యనారాయణరెడ్డి(మిలట్రీ), పడాల సత్యనారాయణ రెడ్డి(బాబ్జి) బిక్కవోలు మండలం పార్టీ కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి(బుజ్జి), మహేంద్రవాడ ఉప సర్పంచ్ మల్లిడి గంగరాజు, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, కొప్పవరం మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, పడాల కల్యాణ్‌ణ్ రెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి (కళ్యాణి), బీసీ సెల్ నాయకులు రొంగల అప్పాజీ, కొండేటి భీమేష్, ఎస్సీ సెల్ నాయకులు తిరగటి శివ, ముస్లిం మైనార్టీ సెల్ నేత ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నిందితులందరినీ అరెస్టు చేయాలి

కోరుకొండ: మధురపూడికి చెందిన పాముల శ్రీనును తీవ్రంగా కొట్టిన అగ్రవర్ణాలకు చెందిన నిందితులందరినీ అరెస్టు చేయాలని నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్‌ను దళిత నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కాపవరంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిశారు. బాధితుడు ఫిర్యాదులో తెలిపిన వారందరినీ అరెస్టు చేయాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో గుమ్ములూరు సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, పండా అబ్బులు తదితరులు ఉన్నారు.

ఘనంగా మహాచండీ యాగం

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీసాయి మందిరంలో గురువారం మహాచండీ యాగం నిర్వహించారు. విజయ దశమిని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం మహాచండీ యాగం జరిపారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల వీర వెంకటకృష్ణ పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛోత్సవ్

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 15 రోజుల పాటు కొనసాగిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శుక్రవారం తెలిపారు. స్వచ్ఛత, సత్యం, అహింస అనే బాపూజీ ప్రాథమిక విలువలను ప్రతి ఒక్కరూ జీవితాంతం ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛోత్సవ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు బాలికల హాస్టల్ ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించి, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు స్వచ్ఛత, ప్రపంచ నివాస దినోత్సవంపై ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ప్రిన్సిపాల్ సందర్శించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్, బాలికల వసతి గృహం డిప్యూటీ వార్డెన్ బి.దుర్గాలక్ష్మి, డాక్టర్ కె.అనూష, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయాల సాధనకు కృషి


పెదపూడిలో గాంధీజీ చిత్రపటానికి నమస్కరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి


బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో మహనీయులకు నివాళులర్పిస్తున్న అధికారులు

పెదపూడి: దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన మహాత్మాగాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు సుధీర్ రెడ్డి, అనంతలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- పెద్దాడ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి, బొడ్డు శ్రీను, మన్యం శ్రీనువాసుచౌదరి పాల్గొన్నారు.
- పెదపూడి మెయిన్ రోడ్డు మార్కెట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ, భీమన ఝాన్సీ రాణి, భీమన చత్రపతి శివాజీ, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, తోటకూర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- పెదపూడిలోని వెలంపాట పాఠశాలలో సిర్విశెట్టి సూర్యప్రకాశ్, ఒబిలిశెట్టి మల్లికార్జునరావు, ఒబిలిశెట్టి సూర్యప్రసాద్, ఒబిలిశెట్టి సత్యనారాయణ, బొడా రాంబాబు పాల్గొన్నారు.

మహనీయుల కలలు సాకారం చేద్దాం

బిక్కవోలు: మహనీయుల కలలను సాకారం చేద్దామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతిపిత గాంధీజీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రాన్ని సాధించిన గొప్పవ్యక్తి గాంధీజీ అన్నారు. జై జవాన్, జై కిసాన్ నినాదంతో హరిత విప్లవాన్ని తీసుకుని వచ్చి, ఆహార భద్రతను కల్పించిన గొప్ప వ్యక్తి లాల్ బహదూర్‌శాస్త్రి అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతల సుమ, పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి సేవలు ఎనలేనివి


లాల్ బహదూర్ శాస్త్రి జయంతిలో పాల్గొన్న మరిదయ్య తదితరులు

రంగంపేట: దేశ ప్రధానమంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రి సేవలు ఎనలేనివని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిదయ్య అన్నారు. దొడ్డిగుంటలోని బాల గణపతి ఆలయం వద్ద శుక్రవారం లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో బాల గణపతి ఆలయ కమిటీ చైర్మన్ వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, పంజా గణేష్, అడబాల బుల్లిరాజు, గుత్తుల సత్యవతి, సీహెచ్ రాంబాబు, తాతారావు, వెంకన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా సమాధి ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో రాజానగరం సాయిబాబా


బూరుగుపూడిలో బాబా

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబా వారి సమాధి ఉత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయ దశమి పర్వదినాన బాబా సమాధి కావడంతో ఆలయం ముంగిట పుష్పాలతో సమాధి నమూనాను ఏర్పాటు చేశారు. ఓం సాయి, శ్రీసాయి, జయజయ సాయి అనే సాయి నామ స్మరణతో పుష్పాంజలి ఘటించారు. మధ్యాహ్నం హారతి తరువాత సమాధి ఉత్సవాన్ని నిర్వహించి, అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఇదిలా వుండగా సాయిబాబా సన్నిధిలో కొలువైన సరస్వతీ మాత విగ్రహం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు జరిగాయి. విజయదశమి రోజున సాయంత్రం శమీ పూజను శాస్త్రోక్తంగా జరిపారు.

బూరుగుపూడిలో..

కోరుకొండ: బాబా సమాధి మహోత్సవాన్ని బూరుగుపూడి బాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, కమిటీ అధ్యక్షుడు కంటే నాగకేశవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అఖండ నామజపయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ నాయకులు కంటే సత్యచక్ర గణపతి, గూడపర్తి పెద్ద, మూతిన శివ మోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఆది గురువు, దివంగత ఆదిపూడి మోహన్‌రావు కుమారుడు కృష్ణసాయి ఆధ్వర్యంలో శనివారం సత్యవ్రతాలు జరగనున్నాయి. ఆదివారం బాబా విగ్రహాన్ని ఊరేగిస్తారు.

ఆర్థిక స్వావలంబనకు స్వదేశీ ఉద్యమం

రాజమహేంద్రవరం సిటీ: నాడు దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని.. ప్రస్తుతం దేశ ఆర్థిక స్వావలంబన కోసం మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఖాదీ సంతను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలతో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనర్ క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణ, రొంగలి గోపి పాల్గొన్నారు.

కనక దుర్గాదేవి ఆలయ అభివృద్ధికి విరాళం


ఆలయ అభివృద్ధికి రూ.2.50 లక్షల విరాళం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ మురళి తదితరులు

పెదపూడి: కరకుదురులోని సేవాకీయం ట్రస్ట్ ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించడానికి కృషి చేస్తున్నామని ఆ ట్రస్ట్ చైర్మన్ తలాటం మురళి అన్నారు. కరకుదురులోని కనక దుర్గాదేవి ఆలయ మండపం అభివృద్ధికి సేవాకీయం ట్రస్ట్ తరఫున అధినేత తలాటం మురళీకృష్ణ, వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు చేతుల మీదుగా రూ.2.50 లక్షల విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళి మాట్లాడుతూ హిందూ ఆలయాల అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వుండ్ర చంద్రకళ, మాజీ సర్పంచ్ సింగినీడి నాగతిరుపతిరావు (దత్తుడు), వారాహి మహిళా మండలి అధ్యక్షురాలు పాటంశెట్టి కాశీ రాణి, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్ర సత్యనారాయణ (వీఎస్ఎన్), యెండ్రు వీర్రాజు చౌదరి, ఆలయ కమిటీ చైర్మన్ తోటకూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం ఆదర్శం


వివేకానంద బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

అనపర్తి: స్వామి వివేకానందుని జీవితం, బోధనలు యువతకు ఆదర్శనీయమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అనపర్తి శ్రీరామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో వివేకపథం 2026 పేరిట ముద్రించిన స్వామి వివేకానంద జీవితం - సందేశం బుక్‌లెట్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. తొలి ప్రతిని సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డికి అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఏటా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు బుక్‌లెట్ అందించి వాటిపై పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు, పురస్కారాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందర రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖరరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం


తూర్పుగానుగూడెంలో మాట్లాడుతున్న కాకినాడ డీఈవో రమేష్

రాజానగరం: భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. డీఎస్సీ 2025లో ఎంపికైన అభ్యర్థులకు ఉమ్మడి జిల్లాలో ఏడు సెంటర్లలో ఈ నెల 10 వరకు ఇచ్చే శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, భూపాలపట్నంలోని రైట్, మల్లంపూడిలోని సాయిమాధవి, ఓడలరేవు (కోనసీమ జిల్లా)లోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలు, కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాల, స్థానిక జీఎస్ఎల్ డెంటల్ కళాశాలలో 1,672 మందికి ఈ శిక్షణ ఇస్తున్నారు. వీరిలో 807 మంది పురుషులు, 865 మంది మహిళలు ఉన్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు


పందలపాకలో అమ్మవారి ఊరేగింపు

బిక్కవోలు: మండల వ్యాప్తంగా గురువారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు జరిపారు. కొమరిపాలెం కనక దుర్గమ్మ ఆలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో 20 కేజీల లడ్డూను గ్రామానికి చెందిన బొబ్బిలి శ్రీనివాస్ రూ.18 వేలకు పాడుకున్నారు. అనంతరం ప్రతి రోజూ కుంకుమ పూజలు చేస్తున్న భక్తులకు లాటరీ నిర్వహించి ఎంపికైన వారికి చీరలు అందించారు. కార్యక్రమంలోని మల్లిడి పెద్దిరెడ్డి మంగయ్యమ్మ దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ జామి విశ్వేశ్వరరావు, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే పందలపాకల వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి అమ్మవారిని వైభవంగా ఊరేగించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు.